# జనారణ్య రోదనం

"ఎక్కడి కెల్తున్నావు బావా ?"

ఆఘమేఘాల మీద సిటీ బస్సుకు సూటిగా దూసుకెళ్లాలని కదలబోతున్న నగరేశం ముందుకు రామబాణంలా దూసుకొచ్చి దీపస్తంబంలా నుంచున్న యువకుణ్ని చూసి నిలువెల్లా నివ్వెరబోయాడు. పొట్టిముక్కు, పొడగాటి పెదాలు, అస్తిపంజరానికి తోలు అతికించినట్టుందా యువాకారం.

"ఏట్లోకెల్తున్నా... పక్కకు జరుగూ !" నగరేశం అసహనం నశాళాని కంటింది.

"అబ్బో ! పరాచకాలాడ్డం బావగార్కి బాగా తెలుసని నాకు తెలుసుగానీ... ఎక్కడి కెల్తున్నావు బావా ?"

"కాస్త తప్పుకోవయ్యా ! సిటీ బస్సెల్లిపోతుందీ." పడబోయి నిలదొక్కుకున్నాడు.

సిటీ బస్సొచ్చి అలవాటు ప్రకారం స్టేజి దాటి నిలబడింది. నగరేశంను కదల నివ్వలేదా యువకుడు.

"అబ్బా ... ! నువ్వెక్కడి కెల్తున్నావు బావా ?"

"అయ్యయ్యో ... నా బస్సు బాబూ ...." పక్కనుండి వెల్లబోతే యువకుని చేతిలోని సూటుకేసు అడ్డమొచ్చింది.

"బస్సు నీది కాదు, ఆర్టీసిది గానీ ..."

"నువ్వెవడివిరా రాస్కెల్ ?" నమలక మింగాలన్పించింది. అది సాధ్యం కాదు కాబట్టి జుట్టు పీక్కున్నాడు.

ఆ బస్సే కాకుండా మరో సిటీ బస్సు గూడా ఇలావచ్చి అలా వెళ్లిపోయింది.

"నా బస్సులు తుస్సు ... జరుగూ ... తప్పుకో !"

"నన్ను గుర్తు బట్టలేదా బావా? నేను నీ బామ్మర్దిని... వరంగల్ వేణుగోపాల్‌ను." సూటుకేసందియ్య బోయాడు.

ఆ సూటుకేసును పుట్‌బాల్‌లా తన్నాలన్పించింది. కాని... అంత పెద్దదాన్ని ఇంత చిన్న కాలుతో తంతే కాలు కట్టెపుల్లలా విరిపోతుందని భయమేసింది. పిసరంత సంయమనం పాటించడమే మేలనుకున్నాడు.

"వేణుగోపాలా ... నా బామ్మర్దా !?" సిటీ కాలేజి గేటులా తెరుచుకుంది నోరు. అదే సందు అనుకున్నాయేమో ఐదారు దోమలు ఆబగా దూరిపోయినై. ఈగలు గూడ రెక్కలు విప్పుకుని జెట్ విమానాల్లా పరుగెత్తుకొస్తున్నాయి.

"దీన్నసలు మస్కిటో టౌను అంటే బాగుండు" అందామనుకుంటే దోమలు గొంతు పెగలనియ్యలేదు. ఉక్కిరి బిక్కిరయాడు. కళ్లల్లో నీళ్లు కమ్ముకుంటున్నై.

"అయ్యయ్యో ! రాక రాక నేనొస్తే నువ్వు కంటతడి పెడ్తున్నావెందుకు బావా? మా అక్క బాగుందా ?" గుండెల మీద చెయ్యేసుకున్నాడు వేణుగోపాల్.

"అయ్యో... టైమైపోయిందయ్యా !" వేణుగోపాల్ షర్టుతో కళ్లద్దు కున్నాడు నగరేశం.

"అయ్యో అక్కా !" గుండెలమీద వాలిపోయాడు వేణుగోపాల్. "ఈ పాడు లోకంలో నీ టైమైపోయిందా ? అంత పుణ్యాత్మురాలివి, ఇంత తొందరగా వెళ్లిపోయావా అక్కా ? ఇప్పుడీ మెగాటౌనులో దగాపడ్డ తోడేలోలె ఎవరింటి కెళ్లాలక్కా ?" గోడుగోడు మంటున్నాడు.

అరికాలు మంట నెత్తికెక్కింది.

"అబ్బా ! అది కాదయ్యా మొండి మొగుడా ! ముందు నువు పక్కకు నడువ్ !" గట్టిగా నెట్టేశాడు. మొదలుకు నరికిన చెట్టులా వేణుగోపాల్ రోడ్డుకడ్డంగా పడిపోయాడు. రెండు చేతుల్తో జుట్టు పీక్కోవడం వినా మరేమీ తోచలేదు నగరేశంకు.

బజారు బతుకమ్మ పండుగ జాతరలాగుంది. చుట్టూ జనాలు గుమిగూడారు.

"ఎందుకయ్యా నడిరోడ్డు మీద కొట్లాట ?" మందలించాడో పెద్దమనిషి.

"అయ్యా రామ... కొట్లాటకాదండీ !" చెప్పబోయాడు నగరేశం.

"పాపమతణ్ని రోడ్డు మీద పడేసి తంతూ ఏదో బుకాయిస్తున్నావా ?" గల్లా అందుకోబోయాడు గల్లలుంగీ వాలా. గలాటా ముగిసింతర్వాతనే గద్దుడు స్థానానికెళ్లాలన్న ఆనవాయితీ ప్రకారం పరుగెత్తుకొచ్చాడో హెడ్ కానిస్టేబుల్.

"ఏందీ ? ఏం కొట్లాటా ? ఏదన్నా ఉంటే మా స్టేషన్లో తేల్చుకోవాలి గాని..." అంటూ పడిపోయిన వాన్ని గల్లా బట్టి లేవనెత్తాడు.

"ఈయన మా బావ గారు సార్ !" షర్టు దులుపుకుంటూ చెబుతున్నాడు వేణుగోపాల్. జనం రద్దీ మరింత పెరిగిపోయింది. వాహనాలు వరుసల్లో ఆగి హారన్లు మోగిస్తున్నాయి. "బావంటే ... మా అక్కకు స్వయానా మొగుడండీ. పోయిన సమ్మర్లో నాముందే పెళ్లయిందండీ. మావారు ముందే చెప్పారు కట్నమివ్వలేమని. ప్రేమించు కున్నాము, నాకు కట్నమెందుకన్నాడండీ, పెళ్లై పోయిందండీ. కాని... మూన్నాళ్లు నెలల్లోనే మోజు తీరిపోయిందేమో మా అక్కను ధారుణంగా చంపేశాడండీ."

"అయితే డౌరీడెత్ ! మర్డర్ కేసన్నమాటా !" హెడ్ కానిస్టేబుల్ గొంతు లారీ

హారన్‌లా మోగింది. అప్పటికే నగరేశం ఆఫీసు టైమైపోయింది.

"గోవిందా... గోవిందా ! ఇహ సెలవుపెట్టడమే శరణ్యం ..." గొల్లుమన్నాడు, షర్టు పీక్కుంటూ.

"ఐతే ... నీ పెళ్లాన్ని నువ్వే చంపావన్నమాటా ! నడూ పోలీస్ స్టేషన్‌కు". హెడ్ కానిస్టేబుల్ చెయ్యి భుజమ్మీద పడింది.

"అది కాదండీ ..." నగరేశం అరణ్యరోదనం.

"అదికాకపోతే ఇంకేది ? నడువ్ స్టేషన్‌కు." హెడ్ లాఠీ హెడ్డు దాకా లేచింది. "నువు గూడా నడువ్. నీ పేరేంది బామ్మర్దీ ?"

"నాపేరు వేణుగోపాల్. మాది వరంగల్ ..."

"సరే గానలోలా .. ఏవారమైందదీ ?"

జనం రొద పెరిగిపోతోంది. ఓ చేత జుట్టు మరోచేత షర్టు పీక్కుంటూ హెడ్ కానిస్టేబుల్ వెంట నడవక తప్పలేదు నగరేశంకు.

"నాపేరు గానలోల కాదు... వేణుగోపాలండీ" అంటూ వెంటనడుస్తున్న వేణుగోపాల్ సవరణ నెవ్వరూ పట్టించుకోలేదు.

❊ ❊ ❊

"అయితే... నా కంప్లయింట్ తీసుకోరా ?" దుర్గాదేవి గర్జనకు పోలీస్ స్టేషన్ దద్దరిల్లింది.

"తీసుకోను గాక తీసుకోను" యస్సై జగదీశ్ చూపులు లాకప్ రూం వైపున్నాయి. నల్గురు డిటెన్యూలు అష్టాచెమ్మ ఆడుకుంటున్నారందులో.

దుర్గాదేవి కుర్చీలో కూచుంది. చెక్కిళ్లు మోదుగుపూలైనాయప్పటికే. గొంతు స్థాయి పెరిగింది.

"ఈ సర్వతంత్ర స్వతంత్ర భారత దేశములో ఓ మహిళకు ఫిర్యాదు చేసే స్వతంత్రం గూడా లేదా ? అలాగైతే ఈ పోలీసు డిపార్టుమెంటెందుకూ ... దండగా..." అటు దండకం నడుస్తూంటే ఇటు కుర్చీలో కాపురం చేస్తున్న నల్లులు ఆమె శరీరాన్ని తొలిచేస్తున్నాయి - పోలీసులకంటే మేమేమన్నా తక్కువ తిన్నామా అన్నట్టుగా. దిగ్గున లేవబోయి కుర్చీతో సహా వెనక్కు పడిపోయింది.

డిటెన్యూలు కిసుక్కుమన్నారు. ఆవిడ భుజాలు పట్టి లేపి కూచో బెట్టా యస్సై. మైకం కమ్మిన అతని చేతుల్లో ఒరిగిపోయిందావిడ.

నగరేశం అండ్ పార్టీ వచ్చేసిందప్పుడే.

"అమానుషం, అత్యాచారం..." గట్టిగా అరిచాడు వేణుగోపాల్. సెంట్రీ పరుగెత్తు కొచ్చాడు. దృశ్యం కళ్లారా చూసి కడుపారా నవ్వాడు.

"అదేమిటీ ? పట్టపగలు పట్టణం నడిబొడ్డున, పోలీస్ స్టేషన్లో రేప్ జరిగి పోతుంటే ... తమాషా చూస్తున్నారా ?" హీరో ఫోజిచ్చాడు వేణుగోపాల్.

"మా యస్సై సరసులే" హెడ్డు మోహం విప్పారింది. ఎలాగోలా సర్దాల నుకున్నాడు.

"మీ కంప్లైంటేమిటి తల్లీ ?" దుర్గాదేవి నడిగాడు.

ఆవిడ సర్దుక్కూచుంది.

"నా భర్త మెడలోంచి బంగారు గొలుసు నెవడో కొట్టేశాడు. కంప్లైంటిస్తే తీసుకోనంటున్నాడీ మహాషయుడు". రోషంతో ఊగిపోతోంది.

"బంగారు గొలుసా ? ఎప్పుడూ ? ఎక్కడా ?"

"ఈ రోజే. మనూరి పొలిమేరల్లో"

"ఇంటే ... కాస్త వివరంగా చెప్పమ్మా !"

"చెప్తా" హెడ్డును తినేస్తానన్నట్టుగా చూసింది. "మా ఆయనీ రోజు హైద్రాబాదు నుండి బస్సులో వచ్చేస్తుంటే ... మనూరి పొలిమేరల్లోకి రాగానే పక్కనున్న దొంగోడు కొట్టేసి రన్నింగ్ బస్ దిగి పారిపోయాడు."

"అరెరే... కేసు చాలా ఇంటరెస్టింగా ఉంది గదా సార్ !" యస్సైని చూస్తూ నవ్వేశాడు హెడ్డు.

"ఇంటరెస్టింగా, పాడా ?" చేతి కర్రతో తలకొట్టుకున్నాడు యస్సై.

"అదేమిటి సార్ ?" ఆశ్చర్యపోయాడు హెడ్డు.

"అదేమిటంటే ... ఈవిడ నా భార్య. బంగారు గొలుసు పోగొట్టుకుంది నేనే. కొట్టేసినోడు వీడే." దబుక్కున ఉరికొచ్చి వేణుగోపాల్ గల్లా అందుకున్నాడు యస్సై.

బతుకు జీవుడా అంటూ బయట పడ్డాడు నగరేశం.

(జలధి పక్ష పత్రిక)

* * *